
# ఋణానుబంధం



## పుల్లాలంతుల వేంకట సుబ్బారావు

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ సూర్యుడు నడినెత్తిన చేరి నిప్పులు కురుస్తున్నాడు ఫ్యానుగాలి వేడిగా తగులు తుండడం వలన నిద్ర పట్టక పక్క మీద పొర్లుతున్న నాకు హఠాత్తుగా బయట పెద్దపెద్ద కేకలు వినిపించ సాగాయి 'ఏమిటా'ని బయటకు వచ్చిన నాకు ఎదురుగా అల్లంత దూరంలో ఆకాశంలోకి నాలుకలు సాచుకుంటూ ఎగిసి పడుతున్న పెద్దమంటలు కనిపించాయి కేకలు వేసుకొంటూ జనం మంటల దిశగా పరుగులు పెడుతున్నారు పరుగెడుతూ నన్ను దాటి వెడుతున్న ఒకతన్ని ఏమయిందని అడిగాను 'చిన్నపల్లె'లో ఇళ్ళంటుకొన్నాయిట' అతను పరుగెడుతూనే సమాధాన మిచ్చాడు

నేను మాష్టరుగా చిన్నపల్లె స్కూలులోనే పని చేస్తుండడం వలన అక్కడ అందరూ పరిచయమున్న వాళ్ళే దానికి తోడు నన్ను రోజూ రిక్షాలో తీసుకు వెళ్ళే రామయ్య, ఇంట్లో పని చేసే ముత్యాలమ్మ కూడ అక్కడే ఉంటున్నారు గబగబా చొక్కా, ప్యాంటు వేసుకొని ఆత్రుతగా నేను కూడ చిన్నపల్లె చేరుకొన్నాను.

నేను చేరకముందే చాల మంది జనం గుంపులు గుంపులుగా అక్కడ పోగయ్యారు ఎదురుగా ప్రళయకాల

భీకరనృత్యం చేస్తున్న అగ్నిదేవుడి ప్రతాపానికి దిక్కుతోచని స్థితిలో వాళ్ళు మతి తప్పిన వాళ్ళులా చూస్తూ నిలబడి పోయారు వాళ్ళ మధ్య నుంచి దూసుకు వచ్చిన రామయ్య చేతిలోని బకెట్‌తో నీళ్ళు మంటలపై గుమ్మరించారు. జనం చైతన్యవంతులై తమ కందిన పాత్రలతో నీళ్ళు తీసుకు వచ్చి గుమ్మరించసాగారు అప్పటికే ఒక గుడిసె పూర్తిగా పరశురామ ప్రీతి అయిపోయింది. ఆ లైనులోనే రామయ్య, ముత్యాలమ్మ ఉంటున్న ఇళ్ళు ఉన్నాయి. అక్కడ చేరిన జనం ఒకళ్ళ కొకళ్ళు చేదోడు కాసాగారు మంటల నార్పే ప్రయత్నంలో. నేను కూడ ఓ బకెట్ సంపాదించి వాళ్ళతో పాటుగా నా వంతు కర్తవ్యం నిర్వర్తించసాగాను అగ్నికి తోడుగా పెద్దగాలి వీచసాగింద. ప్రాణాధారమైన గాలి ఆ సమయంలో ప్రాణసంకటంగా మారింది. పరిస్థితి ప్రమాదకరంగా మారి వాడ మొత్తాన్నే మింగేసేటట్టు తయారయింది.

కొంతమంది గృహస్థులు జాగ్రత్త చర్యగా ఇళ్ళమీది ఆకులు తీసివేయ సాగారు. మరికొంతమంది తట్టా బుట్టా సర్దుకొని పిల్లాజెల్లలతో ఇళ్ళు ఖాళీ చేయసాగారు. పెద్దవాళ్ళ కంగారు, అరుపులు, ఆడవాళ్ళ, పిల్లల ఏడుపుల్తో అక్కడి వాతావరణం గందరగోళంగా, బీభత్సంగా, హృదయ విదారకంగా తయారయింది.

ఒకవైపునుంచి నీళ్ళు పోస్తుంటే ధిక్కారమును సైతునా అన్నట్టు మరోవైపునుంచి మంటలు ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటిపైకి పాకిపోతు న్నాయి.

"ముత్యాలమ్మ" ఇల్లు అంటుకొంది అని అరిచా రెవరో.

"ఒర్నాయనో పిల్లాడు నిద్దరో తున్నాడు లోపల దేవుడో" అంటూ చేతిలో పాత్ర పారేసి ఒక్క ఉదుటున గుంపులో మరోవేపునుంచి ఇంటివైపు దూసుకుపోతున్న ముత్యాలమ్మ కనిపిం చింది

నేను బకెట్‌తో సహా ముత్యాలమ్మ ఇంటికి పరుగు దీసాను. వెనకాలే రామయ్య కూడ వచ్చాడు.

# మిత్రుడు

ఎన్నో ఆశయాల సిద్ధికోసం-
ప్రారంభించిన జీవితం!
దారివెంట చేయూత ఉంటే-
అడుగు ముందుకు పడుతుంది!
పూలు పరిమళిస్తాయి
కాలు పరుగందుకుంటుంది!
ఒక దశలో బరువులు-బాధ్యతలు
పరుగును బంధిస్తాయి.
సూర్యుడు నిలచినట్టు తోస్తుంది
కాలిపై వాత పడుతుంటే-
అడుగు సాగదు. అప్పుడు-
చిక్కబట్టుకోవాలి ధైర్యాన్ని
సాహసమే మిత్రుడు.
లేకుంటే పిడుగు పడుతుంది-నెత్తిన!

కాణిపాకం లింగన్న

# ఋణానుబంధం

క్షణాలమీద మంటలు నడికొప్పు మీదకి వచ్చాయి. తాటాకులు బాగా పాతపడి పోవడం వలన మంటలు వేగంగా పాకు తున్నాయి. మంటలనుండి వస్తున్న సెగలకి అక్కడ నిలబడ్డమే చాల కష్టమయిపోతోంది. లోపలకి వెళ్ళ నీకుండా నలుగురాడాళ్ళు ముత్యా లమ్మను పట్టుకొన్నారు.

"నా పిల్లాడు దేవుడోయ్. నన్నొద లండో, గింజాకొంటోంది వాళ్ళ చేతుల్లో ముత్యాలమ్మ. మంటల ధాటి చూసి ముత్యాలమ్మని వదలడానికి భయపడు తున్నారు వాళ్ళు.

ఆ పరిస్థితిలో ఏం చేయాలో ఎవరికీ ఏం పాలు పోలేదు. 'అమ్మా' అన్న ఆర్తనాదం మంటల్లోంచి దూసుకు వచ్చింది. అంతే అప్పటిదాకా నా పక్కనేఉన్న రామయ్య రెప్పపాటులో సంధించిన బాణంలా మంటల మధ్యకు దూసుకుపోయాడు.

అందరం 'హాహాకారాలు' చేశాం రెండు క్షణాల్లో రామయ్య పిల్లాడితో సహా ఒంటినిండా మంటలతో బయటకొచ్చి పడ్డాడు. వెంటనే గబగబా గొంగళి కప్పి వాళ్ళ మంటలు ఆర్పేసి ఆసుపత్రికి తీసుకెళ్ళడం నా కర్తవ్య మయింది.

ఎవరు ఫోను చేశారో ఏమో గణగణ గంటలు మోగించుకొంటూ ఫైరింజను వేగంగా వచ్చి ఆగింది. అందరిదృష్టి గంటల కారువైపు మళ్ళింది. అగుతూనే బిలబిలమని దిగిన ఫైర్‌మెన్‌లు టాంకర్ వైపు ఆన్‌చేసి గొట్టాలగుండా నీరు మంటలమీదకు పంపి క్షణాలమీద అదుపులోకి తెచ్చారు. పది నిముషాల్లో మంటలు పూర్తిగా ఆర్పేసారు.

* * * *

ఈ సంఘటన జరిగాక సుమారు పది హేనేళ్ళు కాలగర్భంలో కలిసి పోయాయి దీని ప్రభావం వలన రామయ్య, ముత్యా లమ్మ జీవితాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. ఆసుపత్రిలో ఉన్నంత కాలం కొడుకుతో పాటుగా కంటికి రెప్పలా చూసు కొన్న ముత్యా లమ్మలో రామయ్య ఏనాడో పోయిన తన కన్న కూతురుని చూసుకొన్నాడు. భర్త పోయి ఒంటరిగా జీవన సమరాన్ని సాగిస్తున్న ముత్యాలమ్మ కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు ముత్యాలమ్మ కొడుకు ఈ ప్రపంచంలో ఏకాకిగా మిగి లిన రామయ్యకు ఆరోప్రాణ మయ్యాడు. ఎప్పుడూ 'తాతా, తాతా' అని కూడా తిరిగే ముత్యాలమ్మ కొడుకే వాడికి ప్రపంచ మయ్యాడు.

రామయ్య, ముత్యాలమ్మలు కాయ కష్టంతో జీవన సమరం సాగిస్తున్నా కుర్రవాడి అభివృద్ధే వాళ్ళకి కేంద్రబిందు వయింది. స్వతహాగా చురుకైనవాడు, బుద్ధిమంతుడు కావడం వలన నా ఆధ్వర్యంలోనే వాడు కొద్ది క్రమతో బడిలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసాడు. అనతి కాలంలో వాడి అదృష్టం బాగుండి ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మ్యాన్‌గా సెల క్టయ్యాడు. రామయ్య, ముత్యాలమ్మలు కుర్రవాడిని అంతదూరం పంపడానికి మొదట అంగీకరించకపోయినా నేను కలుగచేసుకొని మంచి చెడ్డలు ఎంచిం చిన మీదట అయిష్టంగానే అంగీక రించారు. ఉద్యోగంలో స్థిరపడ్డాక సెలవ లకి కుర్రవాడు ఇంటికి వచ్చి వెడు తుండడం వలన వాళ్ళు కూడ తర్వాత

స్తిమితపడ్డారు

ఓరోజు ఉదయాన్నే వాకిట్లో వాలు కుర్చీలో కూర్చొని పేపరుచూస్తూ కాఫీ తాగుతుండగా ముత్యాలమ్మ గాభరాగా వచ్చింది

"బాబుగారూ, మా అయ్య నాలుగు రోజలనుండి మూసిన కన్ను తెరవడం లేదండి. ఒళ్ళంతా కాలిపోతావుంది. నాకేదో భయంగా ఉంది అబ్బాయికి టెలిగ్రామిచ్చి పిలిపించిపెట్టండి" గుక్క తిప్పుకోకుండా అంది

"డాక్టరుగారికి చూపించలేక పోయావా! అవసరమయితే అలాగే అబ్బాయికి టెలిగ్రాం ఇద్దాం. ప్రతి చిన్న దానికి ఊరికే కంగారుపడి అక్కడ కుర్రాడిని కంగారు పెట్టడం దేనికి. వాడికీ సెలవులు అవీ ఉండొద్దూ" అన్నాను కాఫీ కప్పు పక్కనపెట్టి పేపరు మడుస్తూ

"చూపించానండి డాక్టరుబాబు రోజూ వచ్చి ఇంజీసన్లు చేసి వెడుతున్నారండి మందులు వాడుతున్నాను బాబూ. అయినా ఏం తేడా కనిపించడం లేదండి ఓసారెట్టాగయినా అబ్బాయికి కబురెట్టండి బాబుగారూ" అంది గద్గద స్వరంతో.

"సరే నే వొస్తానుగానీ నువ్వు పద" అని ఆమెను పంపేసి బట్టలు మార్చుకొని రామయ్య ఇంటికి బయలు దేరాను నేను వెళ్ళేసరికి డాక్టరు వచ్చి ఇంజక్షన్ చేస్తున్నాడు. రామయ్య నులక మంచంమీద నీరసంగా పడుకొని ఉన్నాడు బాగా చిక్కిపోయి మంచానికి బల్లిలా అతుక్కుపోయి ఉన్నాడు.

డాక్టరు ఇంజక్షన్ చేసి చీటిమీద మందులు వ్రాసి ముత్యాలమ్మ చేతికి ఇచ్చాడు కిట్ సర్దుకొని బయటకు వచ్చాక "ఎలా ఉంది డాక్టరుగారూ రామయ్య పరిస్థితి" అన్నాను నేను

"రోగం బాగా ముదిరి పోయింది మాష్టారూ మందు కూడా పట్టివ్వడం లేదు. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలిగదా" అన్నాడు డాక్టరు. అంతేగాని ఇతమిద్ధంగా తేల్చి చెప్పలేదు.

డాక్టరు వెళ్ళిపోయాక ముత్యాలమ్మ "ఏవన్నారండయ్యగారూ డాక్టరుబాబు" ఆందోళనతో ప్రశ్నించింది.

"ఫరవాలేదు అదే తగ్గిపోతుం దన్నారు" అన్నాను అసలు విషయం చెపితే మరింత బెంబేలెత్తిపోతుందని

"కుర్రాడికి కాస్త కబు రెట్టించం డయ్యగారు" మళ్ళీ అభ్యర్థించింది ముత్యాలమ్మ

"సర్లే. అలాగే. ఇంటికి వెడుతూ దోవలో ఎలానూ పోస్టాఫీసు ఉందిగదా టెలిగ్రాం ఇచ్చి వెడతాను నువ్వనవసరంగా కంగారుపడి దిగులు పడకు" అని చెప్పి ఇంటికి బయలుదేరాను

* * * * *

పోస్టాపీసులో టెలిగ్రాం ఇచ్చిన తర్వాత పేపర్లు దిద్దుకోవటం, ఇంటి పనులు, బయటి పనులతో సతమతమవుతున్న నాకు వారం రోజులుగా రామయ్యను చూడడానికి వెళ్ళడం కుదరలేదు. ముత్యాలమ్మ కూడా ఏ కబురూ తెలియచెయ్య లేదేమిటి చెప్మా అని అనుకొంటున్న సమయంలో సరిగ్గా గేటు దగ్గర చప్పుడయింది

మా స్కూలు ప్యూను రామ్మూర్తి గేటు తీసుకుని లోపలకి వచ్చాడు

"ఏమిటి రామ్మూర్తి ఇలా వచ్చావు ఏమిటి విశేషం' అన్నాను నేను.

"మీకు తెలీదాండి మాష్టారూ ఉదయం రామయ్య పోయాడు ఇప్పుడే శవాన్ని దహనానికి తీసుకెడు తున్నారు" అన్నాడు రామ్మూర్తి.

అటువంటి వార్త వినవలసి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్న నన్ను ఆ వార్త ఆశ్చర్యపెట్టక పోయినా క్షణకాలం బాధగా అనిపించింది.

"ముత్యాలమ్మ కొడుకు వచ్చాడా" అన్నాను రామ్మూర్తి నుద్దేశించి

"నిన్న సాయంకాలం వచ్చాడుటండీ. ఆ అబ్బాయే దగ్గరుండి అన్నీ చూస్తున్నాడు ఏటో ఆళ్ళిద్దరిదీవిచిత్ర సంబంధమండి" అన్నాడు రామ్మూర్తి

మరి ఆలస్యం చేయకుండా నేను చొక్కా తగిలించుకొని రామ్మూర్తిని వెంట పెట్టుకొని స్మశానానికి బయలు దేరాను

నేను వెళ్ళేసరికి చితికి నిప్పంటించే కార్యక్రమం జరిగి పోయింది మంటల్లో రామయ్య శరీరం సంస్కరింప బడుతోంది నన్ను చూడగానే ఎటునుంచి వచ్చాడో ఏమో ముత్యాలమ్మ కొడుకు ప్రత్యక్షమయ్యాడు

"అయిపోయిందండి మాష్టారూ అయిపోయింది నన్ను మంటల నుండి కాపాడిన రామయ్య తాతకి స్వయంగా నిప్పంటించాల్సి వచ్చింది" అంటూ బావురుమన్నాడు

ఋణాను బంధం అంటే ఇదేకాబోలు అనిపించింది ఆ క్షణంలో తెలీకుండానే చెమర్చిన నా కళ్ళ నుంచి రెండు అశ్రుబిందువులు రాలాయి

O

